# 3. లేఖ



హరిణి,
ఇంటి నెం.: 2330,
చింతామణి అపార్టుమెంటు,
సింగరేణి కాలరీస్ రోడ్డు,
నకోడ, చంద్రపూర్ (జిల్లా),
తేది :

ప్రియమైన స్నేహితురాలు చంద్రికకు,

నేను ఇక్కడ క్షేమము. నీవు కూడా క్షేమమని తలుస్తాను. నీ లేఖ అందినది.

నేను ఈ మధ్య మా పాఠశాల నుండి ఎన్.సి.సి. క్యాంపుకై ఢిల్లీ వెళ్ళాను. నిజంగా మన రాజధాని నగరం చూడతగినది. ఇక్కడ ఉన్న పార్లమెంట్ భవనం, ఇండియాగేట్, రాజ్ ఘాట్, కుతుబ్‌మినార్, ఎర్రకోట మొదలగునవి మేము సందర్శించాము.

ఇండియాగేట్ సమీపంలో ఉన్న అమర్ జవాన్ జ్యోతి అనగా 'యుద్ధ వీరుల స్మారక స్థూపం' చూశాము. మన దేశంలో ప్రతియేటా జనవరి 30వ తేదీన 'అమరవీరుల సంస్మరణ దినం'గా జరుపుతారు. మన దేశ రక్షణ కొరకు పోరాడుతూ, తమ ప్రాణాలనే అర్పించిన త్యాగమూర్తులను స్మరించుకునే రోజు ఇది. అందుకే అందరూ ఈ స్మారక స్థూపం వద్ద పుష్పవలయాలు ఉంచి, వారికి శ్రద్ధాంజలి ఘటిస్తారు. మేము కూడా అక్కడికి వెళ్ళి వారికి గౌరవవందనం చేశాము. ఇలాంటి అవకాశం దొరికినందుకు ధన్యులమయ్యాము.

ఢిల్లీకి దగ్గరలో గల ఆగ్రాకు వెళ్ళి తాజ్‌మహల్ కూడా దర్శించాము. ప్రపంచవింతల్లో ఒకటైన ఆ పాలరాతి కట్టడాన్ని చూస్తూ మైమరిచిపోయాను.

ఇంతటితో ఈ లేఖ ముగిస్తున్నాను. మీ ఇంట్లో పెద్దవారికి నా నమస్కారములు, చిన్నవారికి ఆశీస్సులు తెలియచేయుము. నీ జవాబు కొరకు ఎదురుచూస్తుంటాను.

ఇట్లు,
నీ స్నేహితురాలు,
హరిణి.

చిరునామా.
చంద్రిక,
ఇంటి నెం.: ఎ-301,
నలంద బిల్డింగ్,
అణుశక్తి నగర్,
ముంబయి.



**I. వినండి–సంభాషించండి.**

1. దేశ రాజధానిలో జరుగు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురించి మిత్రునితో సంభాషించండి.
2. మీ పాఠశాలలో జరుగు గణతంత్ర దినోత్సవ వేడుకలను గురించి చర్చించండి.

**II. చదవండి–ఆలోచించండి–రాయండి.**


**అ. పదజాలం పెంపొందించుకుందాం.**

సందర్శించు = చూచు; సమీపం = దగ్గర; సంస్మరణ = గుర్తు చేసుకొను; అర్పించిన = కోల్పోయిన; పొగొట్టుకున్న; వందనం = నమస్కారం; కట్టడం = భవనం.

**ఆ. చర్చించండి–రాయండి.**

1. హరిణి ఢిల్లీకి వెళ్ళిన కారణం.
2. అమర్ జవాన్ జ్యోతి అనగా.
3. జనవరి 30వ తేదీన జరుపుకునేది.
4. ఆగ్రాలో ఉన్న ప్రపంచ వింతల్లో ఒకటి.

**III. కృత్యం:**




**పాఠ్యభాగంలోని కింది పరిచ్ఛేదాన్ని చదివి, సూచనానుసారం కృత్యాలు చేయండి.**

(అ) అల్లిక పూర్తి చేయండి.

ఢిల్లీ నగరంలో చూడదగిన ప్రదేశాలు

పుట సంఖ్య : "నేను ఈ మధ్య మా పాఠశాల నుండి............................ మైమరచి పోయాను" వరకు.

**(ఆ) కింది పదాలను వాటి సమానార్థాలతో జతపరచండి:**

| | | |
|---|---|---|
| (1) సందర్శించు | (   ) | (అ) కోల్పోయిన |
| (2) సమీపం | (   ) | (ఆ) చూచు |
| (3) సంస్మరణ | (   ) | (ఇ) దగ్గర |
| (4) అర్పించిన | (   ) | (ఈ) గుర్తుచేసుకొను |
| | | (ఉ) దూరం |

(ఇ) స్వీయస్పందన: నీవు సందర్శించిన యాత్రాస్థలాన్ని గూర్చి నీ సొంతమాటల్లో రాయండి.

**IV. భాషావగాహన**

**అ. సామాన్య, సంయుక్త వాక్యాలను గుర్తించి రాయండి.**

1. పెద్ద వారికి నా నమస్కారములు, చిన్న వారికి ఆశీస్సులు తెలియచేయి.
2. మన రాజధాని నగరం చూడతగినది.

**ఆ. గీతగీయబడిన ప్రత్యయాలు ఏవిభక్తులకు చెందినవో రాయండి.**

1. ఎన్.సి.సి. క్యాంపుకై ఢిల్లీ వెళ్ళాము.
2. మేము కూడా వారికి గౌరవవందనం చేసాము.
3. త్యాగమూర్తులను స్మరించుకునే రోజు ఇది.

**ఇ. వ్యతిరేక పదాలు రాయండి.**

1. ప్రారంభం x ______ 2. జవాబు x ______

3. వెళ్ళుట x ______ 4. గౌరవం x ______

**ఈ. వ్యతిరేక పదాలు జతపరచండి.**

| (క) వర్గం | (చ) వర్గం |
|---|---|
| 1. వీరుడు | ఎ. విస్మరించు |
| 2. స్మరించు | బి. పారిపోవు |
| | సి. భీరువు |

**అభ్యాసాలు:**

**అ. లేఖలు-అభ్యాసాలు**

1. నీకు నచ్చిన ప్రదేశం గురించి స్నేహితుడు/స్నేహితురాలికి కింది అంశాల ఆధారంగా లేఖ రాయండి.

అంశాలు:

- నీ చిరునామా
- క్షేమ సమాచారాలు
- మొదటి పేరా
- రెండవ పేరా
  * లేఖలో అడిగిన విషయం
  * నీకు నచ్చిన ప్రదేశం
  * ఎక్కడున్నది? ఎప్పుడు చూసావు.
- మూడవ పేరా
- ముగింపు
- స్నేహితుని చిరునామా

**ఆ. స్వీయవ్యక్తీకరణ:**

రిపబ్లిక్ దినోత్సవం రోజు ఢిల్లీలో జరుగు కార్యక్రమం గురించి సొంత మాటల్లో రాయండి.

## లేఖన నైపుణ్యాలు – అనువాదం


పూర్వకాలం నుండే వేర్వేరు భాషల మధ్య ఆదాన ప్రదానాలు జరుగుతున్నాయి. ఇందులకొక ఉదాహరణ ఒక భాషలోని పదాలు మరొక భాషలోనికి చేరటం భాషల మధ్య రకరకాల ఆవశ్యకతలు కలుగుతునే ఉంటాయి. ప్రస్తుత కాలంలో మనం వివిధ హెచ్చరికలు, జనజాగృతి సూచనలను హిందీ, ఆంగ్లం లేదా ఆయాస్థానిక భాషలలో చూస్తుంటాము. వాటిని అర్థం చేసుకోవటం ఎంతైనా అవసరం.



కాబట్టి ఇతర భాషాజ్ఞానం కలిగి ఉండటం మంచిది. అలాగే ఇతర భాషలలోని మంచి సాహిత్యాన్ని ఆస్వాదించటానికి అనువాదాలు ఆధారం.

అనువాదాన్ని తర్జుమా అని కూడా అంటారు. అంటే ఒక భాషలోని విషయాన్ని ఇంకొక భాషలోకి అర్థం చెడకుండా మార్చి రాయటం.

కింది ప్రతిజ్ఞను తెలుగులోకి అనువదించండి.





**సమాచార మార్పిడి.**

**అ. కింది పరిచ్ఛేదాన్ని పట్టికగా రాయండి:**

ముంబయి తెలుగు పాఠశాలలో వనమహోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో మరియు చుట్టుపక్కల నాటడానికి 15 గానుగ మొక్కలు, 6 ఉసిరి మొక్కలు, 8 తుమ్మ మొక్కలు, 9 వేప మొక్కలు తెచ్చారు. అలాగే కార్యక్రమానికి వచ్చే అతిథులకు బహుకరించడానికి రిబ్బనులు కట్టిన అందమైన కుండీలలో 6 గులాబీ, 4 బంతి మరియు 5 చేమంతి మొక్కలు తెచ్చారు.

| క్ర.సంఖ్య | మొక్కల పేర్లు | మొక్కల సంఖ్య |
|---|---|---|
| 1. | గానుగ మొక్కలు | 15 |
| 2. | ఉసిరి మొక్కలు | 6 |
| 3. | తుమ్మ మొక్కలు | 8 |
| 4. | వేప మొక్కలు | 9 |
| 5. | గులాబీ | 6 |
| 6. | బంతి | 4 |
| 7. | చేమంతి | 5 |




**ఆ. కింది విషయాన్ని'పై' (Pie Diagram)లో చూపండి:**

అంబర్‌నాథ్ తెలుగు పాఠశాల గ్రంథాలయంలో
50% తెలుగు పుస్తకాలు, 30% మరాఠి పుస్తకాలు,
20% ఇంగ్లీషు పుస్తకాలు ఉన్నాయి.

వి.సూ.: ఇవ్వబడిన సూచనలను పాటిస్తూ లేఖారచన చేయండి. నెహ్రూ ఇందిరకు రాసిన లేఖలు చదవండి.